క్లుప్తంగా

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వానం



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో వెలసిన కోటమ్మ ఆలయ ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సర్పంచ్ గుల్గరి సరితామల్లేషంతో పాటు ఆలయ కమిటీ సభ్యులు రాజు, విజయ్‌కుమార్ తదితరులు నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల సందర్భంగా మొదటి రోజు సోమవారం ఊరకందూరు, మంగళవారం అమ్మవారికి బోనాలు, బండ్ల ఊరేగింపు, బుధవారం లక్ష్మమ్మ వద్ద పూజ, గురువారం కోటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, శుక్రవారం పాసిబండ్ల ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నట్లు, ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని సర్పంచ్ కోరారు.

'సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు విఫలం'

అల్లాదుర్గం(మెదక్): మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 161 జాతీయ రహదారి విస్తరణలో ఎంపీపీ భవనం, ఎంఈఓ, ఆరోగ్య కేంద్రం భవనాలు కూలి్చవేసి నాలుగేళ్లు గడిచినా నేటికీ నిర్మించలేదన్నారు. ఎంపీపీ హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడి సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. అల్లాదుర్గంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు, పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం, పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఏడేళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేవని వాపోయారు. ఒకే భవనంలో రెండు కార్యాలయాలు కొనసాగిస్తుండటం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. స్థానిక నినాదంతో గెలుపొందిన స్థానిక ఎమ్మెల్యేకు ఈ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, రవి పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులతో రద్దీ నెలకొంది. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేషలు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

రైతులకు అండగా ఉంటాం



లారీలను ఆపుతున్న పీఏసీఎస్ చైర్మన్

శివ్వంపేట(నర్సాపూర్) రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. పలు కేంద్రాల్లో నుంచి ధాన్యం తరలించేందుకు గాను ఆదివారం తూప్రాన్-నర్సాపూర్ హైవేపై లారీలను ఆపి కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 32 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 279 మంది రైతులకు సంబంధించి 204520 బస్తాలను లోడింగ్ చేసి వివిధ రైస్‌మిల్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఉసిరికపల్లి, మల్లుపల్లి, రూప్ల, రెడ్యా తండాలో ధాన్యం కొనుగోలు ముగిసినట్లు చెప్పారు. 10 రోజుల్లో రైతులు పండించిన పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడకూడదని భరోసానిచ్చారు.

అడుగుకో గుంత

- కంకర తేలిన పోచారం-ప్యారారం రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కంకర తేలిన పోచారం-ప్యారారం రోడ్డు

రేగోడ్(మెదక్): గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పిస్తామని పాలకులు పదేపదే చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడటంతో తరచూ వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారు. అయినప్పటికీ స్పందించే నాథుడు కరువయ్యాడు. నిధులు మంజూరైనట్లు ప్రచారం జరుగుతున్నా పనులు మాత్రం నేటికీ ప్రారంభించడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

రేగోడ్ మండల పరిధిలోని పోచారం నుంచి ప్యారారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కంకర తేలి ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డంతా గుంతలపడి ఉండటంతో కిందపడి ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. ప్యారారం నుంచి ఆయా పనుల నిమిత్తం నారాయణఖేడ్, రేగోడ్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, హైదరాబాద్, రాయిపల్లి, జహీరాబాద్ వంటి పట్టణాలకు కూలీలను వాహనాల్లో రైతులు తీసుకెళ్తుంటారు. అయితే రోడ్డంతా గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభించని పనులు..

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్ పూలమ్మతో ప్రస్తావించగా త్వరలో పనులు ప్రారంభిస్తామని సమాధానం చెప్పారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



పోచారం నుంచి ప్యారారం వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిధులు మంజూరు అయ్యాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నా నేటికీ పనులు ప్రారంభించడంలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి.

– భరత్‌రెడ్డి, గ్రామస్తుడు

టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు

పోచారం నుంచి ప్యారారం గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైయ్యాయి. కానీ.. టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుంది. టెండర్ పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, పీఆర్ డీఈ

క్రీడా శిబిరాలతో నైపుణ్యం పెంపు



వాలీబాల్ శిక్షణ పొందుతున్న యువకులు

చిన్నశంకరంపేట(మెదక్): నైపుణ్యం పెంచేందుకే వేసవి క్రీడాశిబిరాలను ఏర్పాటు చేసినట్లు వాలీబాల్ కోచ్ ప్రశాంత్ అన్నారు. మండల పరిధిలోని జంగరాయి గ్రామంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా యుజన క్రీడా సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ శిబిరంలో 30 మంది క్రీడాకారులు వాలీబాల్ శిక్షణ పొందుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతంలో వేసవి శిక్షణశిబిరం ఏర్పాటుతో యువకులు ఉత్సాహంగా క్రీడలపై ఆసక్తిని కనబరుస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



నూతనంగా ఎన్నికైన సభ్యులతో నాయకులు

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని నార్సింగి ఎంపీపీ చిందం సబిత, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బాబు అన్నారు. మండల పరిధిలోని వల్లూరులో ఆదివారం ఆ పార్టీ గ్రామ కమిటీలను నియమించారు. వల్లూరు గ్రామశాఖ అధ్యక్షుడిగా అబ్దుల్ వాహెద్, బూత్ కమిటీ అధ్యక్షుడిగా శేఖర్, సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా సురేశ్, ఎస్సీ కమిటీ అధ్యక్షుడిగా అంబరీశ్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా నాసిర్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా లక్ష్మి, రైతు కమిటీ అధ్యక్షుడిగా ఎల్లయ్య నియమితులయ్యారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ తౌర్యానాయక్, మాజీ సర్పంచ్ నర్సింలు, ఉపసర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని టోప్యా తండాలో బానోత్ రూప్లీబాయ్ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్ ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు రఘువీరారెడ్డికి తెలియజేయడంతో స్పందించిన ఆయన రూప్లీబాయ్ అంత్యక్రియల ఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం ఆదివారం బీజేపీ మండల నాయకులతో పంపించాడు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు ప్రశాంత్ కుమార్, సత్యనారాయణ, ఆనంద్, సంతోష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, మండల ఇన్‌చార్జి ఎల్లు రాంరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సింగాటం గ్రామంలో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో గజ్వేల్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఐటీసెల్ కన్వీనర్ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు నలగామ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్లు మహేశ్, సురేష్, మండల ప్రధాన కార్యదర్శి రాజు, మహిళా మోర్చ అధ్యక్షురాలు స్వాతి, మనోహర్‌యాదవ్, స్వామి, మన్నె శేఖర్, ప్రవీణ్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూరమ్ ఉత్సవాల్లో బతుకమ్మ ప్రదర్శన

చేగుంట(తూప్రాన్): సింగపూర్ పూరమ్ ఉత్సవాల్లో తెలంగాణ బతుకమ్మను ప్రదర్శించినట్లు మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన బసికె ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సింగపూర్‌లోని గార్డెన్స్ బైదిబే దిమిడోస్‌లో ఆదివారం పూరమ్ ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో తెలంగాణ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి సతీమణి అనితారెడ్డి తెలంగాణ బతుకమ్మను ప్రదర్శించినట్లు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై బతుకమ్మను ప్రదర్శించే అవకాశం ఇచ్చినందుకు అనితారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో సింగపూర్ ఆర్థిక, జాతీయాభివృద్ధి శాఖల ద్వితీయ మంత్రి ఇంద్రాణి రాజాతో పాటు సింగపూర్ పూరమ్ వేడుకల నిర్వాహకులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల పేద ప్రజలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా ఆదివారం ఆర్థికసాయం చేశారు. శివ్వంపేటకు చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం మహేష్‌గుప్తా రూ.5 వేల సాయం అందజేశారు. అదేవిధంగా రత్నపూర్ గ్రామానికి చెందిన మన్నే లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం మహేష్‌గుప్తా మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆయ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చాముండేశ్వరీ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

◆ నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా స్వామి



కౌడిపల్లి(నర్సాపూర్): నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గ్రామానికి చెందిన స్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆదివారం స్వామిని ఘనంగా సన్మానించారు. ఇటీవల నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ఎన్నికలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, మాజీ అధ్యక్షుడు అడివయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ధర్మాసాగర్ గ్రామానికి చెందిన స్వామిని జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాగ ఆశమ్మ, ఉపసర్పచ్ జగన్, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లేశ్, నాయకులు సంతోషగౌడ్, వీరారెడ్డి, వైకుంఠం, రాజు, నవీన్, అనిల్ పాల్గొన్నారు.

◆ తండాల అభివృద్ధికి కృషి



చిన్నశంకరంపేట(మెదక్): గిరిజన తండాల అభివృద్ధికి కృషిచేస్తానని మిర్జాపల్లి ఎంపీటీసీ సక్కుబాయి అన్నారు. ఆదివారం మండలంలోని మిర్జాపల్లి తండా, కామారం తండాలలో బోరుమోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మిర్జాపల్లి తండా, కామారం తండా సర్పంచ్‌లు హలవత్ లక్ష్మి, కొడవత్ బుచ్చమ్మ, కాంగ్రెస్ నాయకుడు మోహన్‌నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మంగ్యానాయక్, రవిచంద్, పరుశురామ్, విఠల్‌నాయక్, కిషన్‌నాయక్, రాములునాయక్ పాల్గొన్నారు.

◆ హిందూ ధర్మం కాపాడుకోవాలి



చిన్నశంకరంపేట(మెదక్): హిందూ ధర్మం కాపాడుకునేందుకు యువకులు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత హిందూ వాహిణి సంయోజక్ ఉప్పల రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో హిందూ వాహిణి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ సమాజంలో హిందూ సంఘటన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ వాహిణి కార్యకర్తలు ప్రభాకర్, శ్రీధర్, నవీణ్, సతీష్, శ్రీకాంత్, దత్తు పాల్గొన్నారు.

◆ 31న బ్రాహ్మణ సంక్షేమ భవనం ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో రూ.13 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ సంక్షేమ సదనంను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నట్లు ధూపదీప నైవేద్య, అర్చకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖరశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్):నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సంస్థ తమ సేవా కార్యక్రమంలో భాగంగా మండలానికి చెందిన పలువురు వికలాంగులకు హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కూచారంలో ఆదివారం వికలాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. అనంతరం నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 267వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు చిత్ర, అనిత, ఉపసర్పంచ్ ఆంజనేయులగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలుగౌడ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మంజులరెడ్డి

పాపన్నపేట(మెదక్): ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి తీవ్ర హాని పొంచి ఉందని జీవనది ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజులరెడ్డి అన్నారు. ఆదివారం వారు ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ బాలాగౌడ్, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మీదుర్గా, రాష్ట్ర అధ్యక్షుడు సతీష్, కోశాధికారి మల్లిక, మీరా సారంగం, సరోజ, భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవాల్లో శశిధర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి అభిషేకం, అర్చన, హోమం, పూజా కార్యక్రమాల్లో భక్తులతోపాటు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శశిధర్‌రెడ్డిని సన్మానించారు. దంతేపల్లి ఉపసర్పంచ్ హన్మంతరావు, కాట్రియాల ఉపసర్పంచ్ స్రవంతి రాజేందర్, నాయకులుఎల్లం, రాజు, కట్ట చంద్రం, బాబు, మహేశ్ పాల్గొన్నారు.

రామసముద్రం కట్టపై ధ్వంసమైన జిమ్

నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

దుబ్బాకటౌన్: ప్రజల ఆరోగ్యం..పిల్లల సరదా కోసం లక్షలు వెచ్చించి దుబ్బాక పట్టణంలోని రామసముద్రం కట్టపై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ఆట వస్తువులు(గజిబోలు) పాడై నెలలు గడుస్తున్నా పటించుకునే వారే కరువయ్యారు. 4 ఏండ్ల క్రితం రామసముద్రం కట్టపై ప్రజలు, పిల్లలు సరదాగా సేదతీరడానికే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కృషితో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిరోజు వందల సంఖ్యలో పిల్లలు, పెద్దలు ఇక్కడికివచ్చి జిమ్ చేయడంతో పాటు సరదాగా కాలక్షేపం చేసేవారు. ఈ క్రమంలోనే అసాంఘిక శక్తులు కట్టపై ఏర్పాటు చేసిన జిమ్‌తో పాటు చిల్డ్రన్స్ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో కొన్ని నెలలుగా ప్రజలకు జిమ్, పిల్లలకు గజిబోలు అందుబాటులో లేకుండా తయారైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిమ్‌ను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న అఖిలపక్షం నాయకులు

రామాయంపేట(మెదక్): ప్రత్యేక రెవెన్యూ డివిజన్ సాధనకు అఖిలపక్షం ఆధ్వర్యంలో రామాయంపేటలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 63 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ప్రకటించేవరకు విశ్రమించబోమని, ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కౌడిపల్లి: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సాపూర్: పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నర్సాపూర్‌లోని శ్రీచైతన్య భారతి విద్యానిలయంలో 1997-98 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. క లిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, నర్సింహ్మారెడ్డి, చంద్రశేకర్, నాందేవ్ తదితరులను ఘనంగా సన్మానించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 30ఏళ్ల తరువాత కలిసిన స్నేహితులు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



నర్సాపూర్‌లో..

బీజేపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్దన్‌రెడ్డి, జిల్లా అధికారిక ప్రతినిధి నందురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేవలం 9 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిందని నందు జనార్దన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీని విస్తరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు చేసిన మోసాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు పరిణీత, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సంపర్క్ అభియాన్ యోజన ఇన్‌చార్జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేష్ మహంకాళి, ఉపాధ్యక్షులు అనుపాటి రాజిరెడ్డి, కలచ్చుగారి రాజిరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజు, మండల కార్యదర్శులు శంకర్, శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు లారా, ధర్మారెడ్డి, రేగుల కుమార్, గడ్డం రాజు, సుతారి ప్రశాంత్, రెడ్డి నరేష్, దురుగొళ్ల మహేష్, కుమార్ ప్రణయ్, గోపరి వెంకటేష్ పాల్గొన్నారు.